క్లుప్తంగా

అక్రమంగా కలప తరలిస్తున్న వాహనం పట్టివేత

ఇచ్చోడ: అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అటవీశాఖ అధికారి పుండలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. టాటా మ్యాజిక్ వాహనంలో ఎల్లమ్మగూడ నుంచి మాన్కపూర్ చెక్‌పోస్టు మీదుగా ఇచ్చోడ వైపు అనుమానాస్పదంగా వస్తున్న వాహనాన్ని గమనించి సిబ్బంది వెంబడించారు. చించి గ్రామ సమీపంలో వాహనాన్ని పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో తరలిస్తున్న కలప విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలి


తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

ఇచ్చోడ: చౌకధరల దుకాణాల ద్వారా సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జాదవ్ రామారావు అన్నారు. బుధవారం మండలంలోని గేర్జం చౌకధరల దుకాణంలోని రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం పకడ్బందీగా పంపిణీ చేయలన్నారు. రేషన్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై తిరుపతి

ఇచ్చోడ: ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి ప్రాణాలను ఎస్సై తిరుపతి కాపాడారు. మండల కేంద్రానికి చెందిన వ్యక్తి మంగళవారం రాత్రికి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తున్నానని భార్యకు ఫోన్ ద్వారా తెలిపాడు. దీంతో ఆమె హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై తిరుపతికి తెలిపింది. అప్రమత్తమైన ఎస్సై ఫోన్ లోకేషన్ తెలుసుకొని సిబ్బందితో వెళ్లి వ్యక్తి ప్రాణాలు కాపాడారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

నేరడిగొండ: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) 6వ రాష్ట్ర విద్యా మహాసభ పోస్టర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. బుధవారం టీయూటీఎఫ్ మండల నాయకులు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యా మహాసభలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో సురేశ్ వైద్య, కిరణ్, నారాయణ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

వడూర్‌లో వైద్య శిబిరం


రికార్డులు పరిశీలిస్తున్న హెచ్‌ఈవో రవీందర్

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పరిసరాలతో పాటు వ్యక్తిగతశుభ్రత పాటించాలని, అప్పుడే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అవసరమైన చిన్నారులకు వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డి, ఏఎన్‌ఎం సంగీత, సౌందర్య, పుష్పల, అంగన్‌వాడీ టీచర్ గంగామణి పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాంసి: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 10న నిర్వహించే టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సాయిరి శ్రీకాంత్ కోరారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రంలోని పాఠశాలలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈవో శ్యాంసుందర్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు శివారెడ్డి, ఉపాధ్యాయులు రాజు, కాంచన, ఉపేందర్, మహేందర్, శిల్ప, అమరవాణి పాల్గొన్నారు.

సర్వే ప్రారంభం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. అధికారులు ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు సర్వే తీరును ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు.


ఉట్నూర్‌రూరల్: సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ కాలోనీలో సర్వేను ప్రారంభించారు. సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు చేపినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, కొరెంగా సుంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, సోన్‌కాంబ్లే జితేందర్, సోమోరే నాగోరావ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని బోయవాడ కాలనీలో ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు. నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని అందుకు ఇంటి యజమానులు సహకరించాలని కోరారు.

సిరికొండ: సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులగణన సర్వే మండలంలో బుధవారం ప్రారంభమైంది. ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించిన ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. సర్వేను మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో ఫణీందర్, తహసీల్దార్ తుకారం, ఎంపీవో సంతోష్ కుమార్ పరిశీలించారు.

బోథ్: మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే బుధవారం ప్రారంభమైంది. బుధవారం సిబ్బంది ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేశారు. మండల వ్యాప్తంగా 132 మంది ఎన్యూమరేటర్లు సర్వేను నిర్వహిస్తున్నారు. బోథ్ ఎంపీడీవో రమేశ్, ఎంపీవో జీవన్ రెడ్డి సర్వే సాగుతున్న తీరును పరిశీలించారు.


తలమడుగు: పరిశీలిస్తున్న అధికారి గజనంద్


ఇంద్రవెల్లి: సర్వేను ప్రారంభిస్తున్న అధికారులు

తలమడుగు: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ, మండల ప్రత్యేకాధికారి గజానంద్ అన్నారు. మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ఆయన ప్రారంభించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సమగ్ర ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలన్నారు. సర్వే చేపట్టిన ఇంటికి స్టికర్లు అంటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో వెంకట్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి గజానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన ఎమ్మెల్యే

నేరడిగొండ: సమగ్ర కుటుంబసర్వేను పారదర్శకంగా చేపట్టాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలో చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని కోరారు. ఏ ఒక్క ఇల్లు మిగిలిపోకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు.


బోథ్: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్


నేరడిగొండ: సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పత్తికి మద్దతు ధర పెంచాలి


కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న సవాపురే విలాస్

నేరడిగొండ: ప్రభుత్వం రైతుల పక్షాన ఆలోచించి పత్తికి మద్దతు ధర పెంచాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని దర్శిని జిన్నింగ్‌లో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ముందుగా రైతును శాలువాతో సన్మానించి పత్తితో వచ్చిన ఎడ్ల బండికి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి విక్రయించడానికి వచ్చే అన్నదాతలకు తేమ విషయంలో అధికారులు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో మంచు ఎక్కువగా కురుస్తుందని, దీంతో సహజంగానే పత్తిలో తేమ శాతం ఎక్కువ చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోయా పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘం నాయకుడు బండి దత్తాత్రేయ అన్నారు. వామపక్షాల నాయకులు బుధవారం జైనథ్ తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులోని సోయా కొనుగోళ్లను పరిశీలించారు. జిల్లాలో అత్యధికంగా సాగు చేసే పత్తి పంటను విక్రయించేందుకు రైతులు మార్కెట్‌కు తీసుకువస్తే దోపిడీ గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారులు, ప్రైవేట్ వ్యాపారులు కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవర్ధన్, గణేష్ యాదవ్, లక్ష్మణ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో బుధవారం సీసీఐ, ప్రైవేటు పత్తి కొనుగోళ్లను జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సవాపురే విలాస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్‌తో కలిసి ప్రారంభించారు. తేమశాతం ఎక్కువగా వచ్చిన ఎడ్ల బండ్ల పత్తి కొనుగోలుకు సీసీఐ అధికారి నిరాకరించారు. దీంతో రైతులకు, సీసీఐ అధికారికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరికి ప్రైవేటు వ్యాపారులు ముందుకు వచ్చి కొనుగోలు చేశారు.

నేడు పత్తి కొనుగోళ్ల ప్రారంభం

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని శ్రీగురు సాహెబ్ చంద కాటన్ ఇండస్ట్రీస్‌లో సీసీఐ ఆధ్వర్యంలో ఈనెల 7న పత్తి కొనుగోళ్ల ప్రారంభమవుతున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్, సీసీఐ సీపీవో మనోజ్ ఠాక్రెలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 శాతం లోపు తేమ పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు.

పల్లె ప్రకృతివనం అభివృద్ధికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి: దస్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని మరింత అభివృద్ధి చేయాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. బుధవారం పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. నాటిన మొక్కలు, బతికిన మొక్కలను పరిశీలించారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకొని, మరింత అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం కులగణన కార్యక్రమాన్ని పరిశీలించారు. పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్‌లు మహేందర్, విఠల్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

ఉపాధ్యాయుడిని తొలగించాలి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బేల: తెలుగు మీడియంలో చదివి ఇటీవల డీఎస్సీలో అక్రమంగా మరాఠీ మీడియంలో ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన జాదవ్ రాజేందర్‌ను ఆ పోస్టు నుంచి తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడ శంకర్, మండల అధ్యక్షుడు సిడాం నందకుమార్‌లు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంఈవో కోల నర్సింలుకు వినతిపత్రం అందజేశారు. తెలుగు మీడియంలో విద్యాభ్యాసం పూర్తి చేసి, మరాఠీ మీడియంలో చదవనీ జాదవ్ రాజేందర్ మరాఠీ మీడియంలో(కాంఘర్‌పూర్ ఎంపీపీఎస్‌లో) ఉద్యోగం పొందడం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. సర్టిఫికెట్స్‌ను సరిగా పరిశీలించని అధికారులపై ప్రభుత్వం శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అతడిని ఉపాధ్యాయ పోస్టు నుంచి తొలగించి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గేడం శ్యాంరావు, సిడాం పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

దండారీ బృందాలకు చెక్కులు పంపిణీ

నార్నూర్: ఆదివాసీలు జరుపుకునే దండారీ ఉత్సవాలకు ప్రభుత్వం అందిస్తున్న చెక్కులను బుధవారం దండారీ బృందాలకు గాదిగూడ మండల కేంద్రంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కనక రామారావు, గిరిజన పెద్దలతో కలిసి అందజేశారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ఉన్నతమైనవి అన్నారు. గిరిజనులకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనివ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడ చంద్రకళ రాజు, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూరు సంతోష్, ఆత్రం నాగోరావ్, ఉపాధ్యాయులు ఆర్కా యాదగిరి, సిడం నాగోరావ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి

ఎదులాపురం: డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎమ్మెల్సీగా బరిలో దిగుతున్న తనను పట్టభద్రులు భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. భిక్షాటన వృత్తి చేసుకుని బతికే రాజలింగం, గంగమ్మ దంపతులను ఐదుగురు సంతానంలో తానే మొదటి వాడినన్నారు. విధి నిర్వహణలో ఎన్నడూ కూడా పక్షపాతం చూపకుండా విధులు నిర్వహించి గుర్తు చేశారు. అలాంటి తనను పట్టభద్రులు ఆదరించాలని కోరారు.

రైతు సమస్యలపై వినతి

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండల తహసీల్దార్ రఘునాథ్‌రావుకు రైతు భరోసా ఎకరాకు రూ.15వేలు చెల్లింపు పెండింగ్, పత్తి తేమశాతం 20వరకు మినహాయించి సీసీఐ కొనుగోళ్ల చేపట్టాలని అఖిలపక్షం రైతు కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రొకండ్ల రమేశ్, బండి దత్తాత్రి, జక్కుల మధుకర్, సతీష్‌పవార్, ప్రమోద్ రెడ్డి, దేవన్న పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతిని ఈనెల 28న అధికారికంగా నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌస్‌లో మాట్లాడారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైయస్సార్ ఉన్నప్పుడు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం జరిగిందన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

తలమడుగు: గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి కిషన్ అన్నారు. బుధవారం మండలంలోని సకినాపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి లావణ్య, కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది రాజశేఖర్, మోహన్ దాస్, శివశరణ్, సిబ్బంది సౌమ్య, విజయ్, గంగన్న, ఆశన్న, రాజు పాల్గొన్నారు.

సైబర్‌క్రైంపై అప్రమత్తంగా ఉండాలి

బేల: విద్యార్థులు మాదకద్రవ్యాలు, సైబర్‌క్రైంపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాధిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు సేవించడం, పండించడం, అమ్మడం చట్టరీత్యా నేరామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భగవాండ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన సబ్ కలెక్టర్


రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గామ్ గ్రామ పంచాయతీ శివారులో నిర్మించిన చెరువుతో తన భూమి ముంపునకు గురైందని పెందోర్ శంకర్ అనే రైతు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. బుధవారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పరిశీలించారు. చెరువు భూమితో పాటు పరిసర ప్రాంతంలో సాగు చేసిన వ్యవసాయ భూములను పరిశీలించారు. వ్యవసాయ భూములను సర్వే నిర్వహించి కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఆర్‌డీవో కార్యాలయ ఏవో భీంరావ్, ఏఈ ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లు చేయాలని ధర్నా


రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో సోయా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోని జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా సోయా కొనుగోళ్లు చేయని అధికారులు ఈరోజు ప్రారంభంలోనే తేమ శాతం పేరుతో ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రఘునాథ్‌రావు రైతుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత మార్కెట్ అధికారులను పిలిపించి మాట్లాడారు. దీంతో రైతులు ధర్నా విరమించడంతో సోయా కొనుగోళ్లు సజావుగా సాగాయి.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేద్దాం


సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేద్దామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కుచులాపూర్ గ్రామంలో ఇందిరా క్రాంతి మహిళా శక్తి విజయ స్టీల్ బ్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్లాస్టిక్ నిర్మూలన కోసం పాటుపడాలని మహిళలు, అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. స్టీల్ వస్తువులను ఎక్కువగా వాడాలని అన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో జీవన్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, సురేందర్ యాదవ్, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు

సిరికొండ: మండలంలోని రాంపూర్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రధానోపాధ్యడు రమేశ్‌గౌడ్ బదిలీపై వెళ్లడంతో తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు బుధువారం వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడం బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చౌహన్ నరేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి


పశువులకు టీకాలు వేస్తున్న రామారావు

తాంసి: పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ రామారావు అన్నారు. బుధవారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో పశువులకు టీకాలు వేశారు. కృత్రిమ గర్భధారణపై అవగాహన కల్పించారు. జన్మించిన దూడలకు నట్టల నివారణ మందు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో భీంపూర్ పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్, సిబ్బంది వినీల్, లక్ష్మణ్, రాకేశ్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎస్. స్వామి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆదిలాబాద్ జిల్లా కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న వ్యవస్థాపక వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం ఉదయం 8 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి విద్యార్థుల ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయ ఆవరణలో వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

బీజేపీది అభివృద్ధి నినాదం

ఆదిలాబాద్: బీజేపీది అభివృద్ధి నినాదమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మహారాష్ట్రలోని వర్ధా అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచారంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. మహారాష్ట్రలో బీజేపీయే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చేసిన అభివృద్ధి గురించి ప్రజల్లో విస్తృతమైన చర్చ జరుగుతుందన్నారు. ప్రజలు ఎమ్మెల్యే అభ్యర్థి పంకజ్ బోయర్‌కు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. అభ్యర్థి విజయానికి పాటుపడాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన బద్దం మోహన్ రెడ్డి, సున్నపు రమేశ్, యాల్ల బుచ్చ రెడ్డి మాతృమూర్తి, నందుకుమార్ మాతృమూర్తిలు ఇటీవల మృతి చెందడంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం వారి కుటుంబాలను పరామర్శించారు.

బాలనందం వర్ధంతి

బోథ్: మండల మాల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాలనందం వర్ధంతిని బుధవారం నిర్వహించారు. మాలల అభివృద్ధికి నిరంతరం పోరాటం చేసిన ఆయనను స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మెరుగు ప్రభాకర్, బక్కువారి సురేందర్, మద్దెల మహేశ్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల మంజూరులో జాప్యం తగదు

బోథ్: రేషన్‌కార్డులను వెంటనే అందించాలని, జాప్యం తగదని బజీఏవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మానాల శేఖర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల కుదింపు కోసమే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు.

డిప్యూటీ సీఎంను కలిసిన అరుణ్ కుమార్

బోథ్: కాంగ్రెస్ తెలంగాణ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ బుధవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను అధికారిక నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి, సమస్యలు, రాజకీయపరమైన వాటి గురించి చర్చించినట్లు తెలిపారు.

సన్మానం

తాంసి: భీంపూర్ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం భీంపూర్ పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయులు శివారెడ్డి, శిల్ప, మల్లేశ్, గోపికృష్ణ, శ్రీనివాస్‌లను ఎంఈవో శ్యాంసుందర్, పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కాంచన, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ

బోథ్: మండలంలో సొనాల గ్రామానికి చెందిన ఊరె సుధాకర్, లావణ్యల కుమారుడు ఊరె అశ్విని మంచిర్యాల జిల్లాలో జరిగిన అండర్- 14 చెస్ విభాగంలో ఉత్తమ ప్రతిభకనబర్చాడు. ఉమ్మడి జిల్లా టాపర్‌గా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. కాగా అశ్విన్‌ను తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

తలమడుగు: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై అంజమ్మ అన్నారు. బుధవారం అంతర్రాష్ట్ర రహదారిపై ఉండమ్ గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అదేవిధంగా వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట సిబ్బంది రామ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.